

# అమెరికా అమ్మాయి

## - శ్రీనిధి యెల్లల



### కారు దిద్దిన కాపురం

**ఇదేంటీ** ఇలా జరిగింది. ప్రకృతి నా పై పగపట్టలేదు కదా! చాలా జాగ్రత్తగా ఒళ్ళు దగ్గరపెట్టుకునే ఉన్నానే! ఇప్పుడెలా? ఏమిటి చెయ్యడం? తృటిలో జరిగిపోయింది కదూ. కన్ను మూసి తెరిచేంతలో ! జీవితంలో ఘోరాలన్నీ ఇలానే ఏం జరుగుతోందో తెలిసేలోపు జరిగిపోతుంటాయి. ఎంత సేపూ ఏదో ఒకటి ఆలోచిస్తూ ఉంటుంది వెధవ బుర్ర. కాస్త పరధ్యానంగా ఉన్నందుకు ఇప్పుడు చూడు.

ఒకసారి లేచిన దగ్గరినుండి ఈ క్షణం వరకు రివైండ్ చేసి చూద్దాం...

పూర్తిగా తెల్లారక ముందే ఈయన ఆఫీసుకు వెళ్లిపోయాడా! గడియారంలో పెద్ద ముల్లులా నేను కంగారు పడుతూ బుడ్డిదాన్ని అరుస్తూ రెడీ చేస్తున్నానా! బుడ్డి కూడా చిన్న ముల్లులాగా నిదానంగా నిమ్మళంగా ప్రపంచ దేశాల శాంతి దూతలా తన లోకాలలో విహరిస్తూ ఏవేవో ఊహిస్తూ ఏదో నాకోసం రెడీ అవుతోందా! అప్పుడు కూడా నాకు ఈ రోజు ఇంత ఘోరం జరుగుతుందని ఏ సూచనా అందలేదు.

అలాగే ఎలాగో లాక్కెళ్లి, బేబీ సీటులో పిల్లని కూలేసి పీక్ అవర్స్ లో 40మైళ్ళ కనీస స్పీడ్ ఉండే రోడ్డులో 20మైళ్ళ స్పీడ్ లో వెళ్లే జాతి ముత్యాలకు అష్టోత్తరం చదువుతూ, పిల్లని కరెక్టు టైంకి టీచర్ గారి చేతిలో పెట్టి అప్పగింతలు చెప్పినప్పుడు కూడా అంతా బాగానే ఉంది. ఇంకో ఇరవై నిముషాల్లో ఇలాగవుతుందని తెలిసుంటే వెనక్కెళ్ళి అంతా మార్చేద్దును. ఎంసెట్ లో తెలిసి కూడా తప్పు పెట్టినప్పుడు ఆ ఒక్క తప్పుకి వందల్లో ర్యాంకు వెనక్కెళ్ళిపోయినప్పుడు అచ్చం ఇదే ఫీలింగు.

సోమవారం పిల్లలని స్కూల్ లో దింపడం కన్నా భారమైన, బరువైన పని ఇంకోటి ఉండదు. ముక్కు మూతీ బిగించి దుఃఖాన్ని అద్దేసి "ఈ బాధ నీకు తెలీదూ? అమ్మని వదిలి అక్క చెయ్యి పట్టుకుని తిరిగి తిరిగి చూస్తూ వెక్కుతూ వెళ్లిన ఎల్.కే.జీ లు గుర్తులేవూ?" అనే చూపులు గుండెల్ని కోసేస్తాయి. అమ్మో! గట్టిగా లేకపోతే ఎలా? మరి క్రమశిక్షణో! నేర్చుకోవలసిందే. రేపటికి సిద్ధం చేయవలసిందే. ఎందుకో అమ్మకి ఫోన్ చేసి 'సారీ' చెప్పాలి అనిపించింది.

తరువాత ఏం చేశాను ... ఎఫ్.ఎమ్ వింటూ తిరిగి వస్తూన్నానా? కరోనా వైరస్ గురించి చెప్తున్నారు. ప్రెసిడెంట్ గారు చైనా మీదుగా వచ్చే వారిని, వెళ్లాలనుకునే వారిని ఇంకోసారి ఆలోచించుకోమని చెప్తున్నారుట. వెంటనే పొద్దున వచ్చిన వాట్సాప్ మెసేజ్ గుర్తొచ్చింది "ఈశాన్య దిక్కున విషగాలి పుట్టేనూ...కోరంకి అను జబ్బుపుట్టును అని బ్రహ్మం గారు ఎప్పుడో చెప్పారూ" అని.

భలే పట్టేస్తారే మన వాళ్ళసలూ! విమానాలు, స్కైప్ కాల్స్, అండర్ వాటర్ బ్రిడ్జిలు అసలు మన పురాణాల్లో, శతకాల్లో లేని వింతలు ఏవీ? ఊహలన్నీ వాస్తవాలైపోతున్నాయా? ఇట్లా సంబంధం లేని విధంగా ఎక్కడెక్కడో లింకులు కలుపుకుంటూ ఇంటికి చేరిపోయానా! పార్కింగ్ లాట్ కొచ్చేసరికి 'హమ్మయ్య' అని కాస్త రిలాక్స్ అయిపోయా. అదే నే చేసిన తప్పు.

మా ఏరియా కాస్టుకో వాడు 'మసాలా మ్యాగీ' కూడా అమ్మడం మొదలెట్టాడు. మన వాళ్ళ తాకిడి ఇలానే ఉంటే 'డిమాండ్ అండ్ సప్లై' ప్రకారం ఇండియన్ స్టోర్లకి గట్టి పోటీ ఇచ్చేట్టున్నాడు కాస్టుకో వాడు. ఈ విషయం అర్జెంటుగా ఫ్లోరిడాలో ఉన్న నేస్తానికి చెప్పెయ్యాలి అనుకుంటూ సర్రున పార్కింగ్ స్పాట్ లోకి తిప్పా. కాస్టుకో వాడు మ్యాగీ అమ్మితే నాకేంటీ? మామిడి తాండ్ర అమ్మితే నాకేంటీ? అవసరమా నాకు! సప్త సముద్రాలూ ఈదిన వీరుడు పిల్ల కాలువలో పడ్డాడనీ! పార్కింగ్ లాట్ లో పిల్లర్ ని ఒకవైపు రాచుకుంటూ వెళ్ళిపోయింది కారు. అయ్యో అయ్యో అనుకుంటూ వెనక్కి తెచ్చేలోపు మళ్ళీ ఇంకోసారి నొక్కుకుపోయింది. నా గుండెకాయ చక్రాల కింద నిమ్మకాయలా నలిగిపోయినట్టు అనిపించిందనుకో. అప్పుడు ఆగిన కాలాన్ని ముందుకు వెళ్లనీయకుండా వెనక్కి తిప్పుదామని ఎంత ప్రయత్నించినా కదలదేం? కుడి వైపు బంపర్ నుండి వెనుక వరకూ రేకుచేటతో రాచినట్టు డొక్కుపోయింది.

అసలు అమ్మాయిలని ముట్టుకుంటే కందిపోతారనీ అదని ఇదనీ వర్ణిస్తారా! నన్నడిగితే ఈ కార్లంత సుకుమారులు వేరెవ్వరు ఉండరు గాక ఉండరు . ఉత్తినే డోర్ తెరిచేప్పుడు పక్క వాటికి తాకాయా, గీతలు పడిపోతాయ్. పార్కింగ్ చేసేటప్పుడు తీసేటప్పుడు గుండెలు అరచితేలో పెట్టుకుని ఊపిరి బిగపట్టి చెయ్యాలి. కొంచం అటు ఇటు అయినా అంతే సంగతులు. ఏడు మల్లెల ఎత్తు రాకుమారి కూడా వీటి ముందు దిగదుడుపే. చాలా పెద్ద డామేజీ. ఇన్సూరెన్సు పోనూ మనమీద పడే భారం తలచుకోగానే 'గుండె కలుక్కుమంది.' ఇదంతా ఒక ఎత్తయితే కారు ఇతగాడికి ఆరోప్రాణం కదా ! పెళ్లైయ్యాక మొదటి సారి తిరుపతి కొండ ఎక్కుతున్నపుడు నాకు చెయ్యి అందించి ఎంత అపురూపంగా కొండ ఎక్కించాడో అంతకుమించిన అనురాగంతో చూసుకుంటాడు కదూ దీన్ని. వారానికో సారి వాక్యూమ్ చేసుకుని, నెలకోసారి తలంటీ! వామ్మో ! రాజు గారికిష్టమైన గుర్రానికి దెబ్బ తగిలిందని ఎవరయ్యా చెప్పగలిగేది ?

ఊరికే ఉండక ఎంత పని చేసా ? ఇక్కడ ఎగిరి అక్కడ దూకుతాడు కాబోలు. మాట్లాడడం మానేస్తాడేమో ? అమ్మకి ఇంతకు ముందు చూసీ చూడనట్టు వదిలేసిన వాటితో కలిపి ఫిర్యాదులు వెళ్తాయా? ఇదియే నా నూరవ తప్పా ? ఈ పార్కింగ్ లాట్ చీలిపోయి అందుట్లో నుండి మందార పువ్వులో కూర్చున్న అమ్మమ్మ వస్తే బాగుండు. సీతాదేవిలా నేను ఆవిడ నూలు చీరలో దాక్కుంటే మళ్ళీ భూమిలోకెళ్ళిపోయి అమ్మమ్మ ఊరులో తేలిపోతే బాగుండు. భోరున ఏడవాలనిపించింది. చందమామ కథలన్నీ నిజమయ్యి నే చేసిన మంచి పనులకి మెచ్చి యక్షిణి గారొచ్చి 'గులేబకావళి పుష్పం' ఇస్తే ఒక్కసారి ఒకే ఒక్కసారి అలా కారుకి తాకించి ఇలా ఇచ్చేస్తాను. ఎన్ని సాధించినా 'ఒట్టి మానవ మాత్రులం' అని నేలమీదికి లాగేస్తుంది కదూ జీవితం. యక్షిణి సంగతి దేవుడెరుగు, ముందు తేరుకుని గూగుల్ ని అడిగి ప్రథమ చికిత్సలూ , ఫస్ట్ ఎయిడ్ లు అన్నీ చేశా. జబ్బలు పట్టేసాయి కానీ ఏమీ గుణం కనిపించలేదు. చేసేదేమీ లేదు ఇక. నాలుగు గారేజ్ ల చుట్టూ తిరిగి "ఖ్వోట్స్" రాయించుకుని ఇన్సూరెన్సు వాడిచేత ప్రైవేట్ చెప్పించుకుని ... ఆహా! రాబోవు కాలాన నా వైభోగం కళ్ళకి కట్టినట్టుగా ఉంది.

ఈ గండం గడిచే విధానం ఎలాగో తెలీటం లేదు. చిన్నప్పటిలాగ అక్క మీదకి తోసేద్దాం అంటే అక్క లేదు. ఇప్పటిలా పిల్ల మీద వేసేద్దాం అంటే బుడ్డదానికి మాటలు వచ్చేసాయి. కళ్ళు మూసుకుని కాసిన్ని తిట్లు పడదాం అంటే 'సాధికారహంకారం' అడ్డొస్తోంది. తప్పు తప్పేగా. ఏ కార్డు నన్ను రక్షించలేదు ఈ రోజు. మొన్ననే 'ఇయర్ పోడ్స్' పోగొట్టేసాడు అని చెప్పి 'విధులు – బాధ్యతలు' మీద మూడు గంటలు క్లాస్ పీకాను. అది ఇంకా మర్చిపోయి ఉండడు. అది గుర్తుపెట్టుకుని 'సమాన హక్కులు' కింద ఇప్పుడు నాకు స్పెషల్ క్లాస్ తీసుకోడు కదా! ఇహ ఇంటికెళ్లి తీవ్రంగా ఆలోచించాలి. ఎందుకైనా మంచిది దొండకాయలు కోస్తూ ఆలోచిద్దాం అని మొదలుపెట్టా.

ఏముందీ రాగానే చెప్పేద్దాం. ఇలా ఇలాగ అయ్యింది అని. ఏమన్నా అంటే 'అఫెండ్' అవ్వకుండా నన్ను నేను 'డిఫెండ్' చేసుకోడానికి కొన్ని అస్త్రాలు పోగెయ్యాలి.

1. "నన్ను ఇంత దూరం లాక్కొచ్చి పడేసావ్. నా కెరీర్ అంతా నాశనం చేసేసావ్" అని ఎప్పటిలాగే మొదలెట్టనా?

ఊహు ...లాభం లేదు. చీటికీ మాటికీ ఇదే వాడుతున్నానని చెప్పేసి ఒక రోజు ఇద్దరి మధ్యన పంచాయతీ పెట్టించి ఆఖరికి "అమెరికా జీవితం నాకు చాలా ఇష్టం. ఇక్కడి వ్యక్తి స్వేచ్ఛ, భావ స్వేచ్ఛ, ఆర్ధిక స్వేచ్ఛ, జీవిత స్వేచ్ఛ కి నేను కట్టు బానిసని." అని నా చేతే ఒప్పించాడు. అలా నన్ను ఎన్నో సార్లు కాపాడిన బ్రహ్మాస్త్రాన్ని విడిచిపెట్టేసా.

2. పోనీ "అనకూడని మాటలు అని మనసుని బాధపెట్టినా సహిస్తున్నాను కదా?" ఈ కోణం నుండి ప్రయత్నించినా ?

ఉహూ ... బుర్రని ఎంత విదిల్చినా  మా ఇద్దరి మధ్యన జరిగే వాద ప్రతి వాదాలలో చివరగా నా గొంతే వినిపిస్తోంది కానీ ఈయన గొంతు ఏదీ! ఇది నా విజయమా? లేక 'ఎందుకొచ్చిన గోల' అని అతను చూపే నిరాసక్తా? ఛ ఛ ...ఇకపై నేను మెల్లిగా మాట్లాడాలి. పాపం! ఇంకా ఇప్పట్లో  "యాంగ్రీ యంగ్ మాన్లు" ఎక్కడ ఉన్నారు? జీవితం తోనూ, జీతం తోనూ కుస్తీ పడి పడీ ఎప్పటికో పెళ్లి అవుతుందా...ఇంక పెళ్ళాం అపురూపం కాక ఏమవుతుంది. ఆ సంగతి కనిపెట్టి "ఎక్సప్లాయిట్ " చేస్తున్నామా మేము? కాబట్టి ఈ అవకాశం కూడా పోయింది. ఇట్స్ గాన్.

3."తరతరాలుగా యుగ యుగాలుగా మమ్మల్ని తొక్కేశారు...!" పోనీ ఇది.

ఆబ్బే ! అస్సలు లాభం లేదు. అత్త మీద కోపం దుత్త చూపించినట్లు, తాతలు మామయ్యలు చేసిన వాటికి వీళ్ళని ఏమని సాధిస్తాము? గట్టిగా "నాకు ఇది కావాలి." "ఇదేంటి ఇలా ఉంది?" అని కూడా అనలేరు ఈ కాలం వారు. కూరలో ఉప్పు తక్కువయిందని పళ్లెం విసిరికొట్టే కాలానికి ఎప్పుడో చెల్లు చీటి ఇచ్చేశాం కదా. కావాలంటే ఆ వంటకాన్నితమ తెలివితేటలతో 'ఇంప్రొవైజ్' చేసి 'సర్ప్రైజ్' డిష్ గా మార్చేస్తారు వీళ్ళు.

4."ఇంటి పని, వంట పని అంతా నేనే చేస్తున్నానా...అయినా కూడా !" ఇదో...

ఊహు ...ఇది మరీ చీపు. తూకం వేసి చేసే పనుల్లో తన వైపు త్రాసు ఎప్పుడూ భూమిలోకి క్రుంగి ఉంటుంది. తేలిక పనులన్నీ నా త్రాసులోకి, ముఠా మేస్త్రీ పనులన్నీ తన త్రాసులోకీ వేసేసి ఏమాత్రం మొహమాటం లేకుండా లేడీస్ కార్డుని నా ఇష్టానికి వాడుకుంటాను కదూ. అస్సలు వద్దు . తల్లీ బిడ్డా న్యాయం పాటించాలి కాస్తైనా.

ఎలాగబ్బా ? ఎక్కడా అందకుండా పొందకుండా ఉన్నాడే! ఒకవేలుతో తనని చూపిస్తే మూడు నావైపుకే చూపిస్తున్నాయే...

5. పోనీ "మీ మగవారే ఇంత! దయ లేదు, నీతి లేదు, న్యాయం లేదు ! యూ డోంట్ డిసర్వ్ అవర్ లవ్ " అని నాటకీయంగా మగవారినందరినీ ఒకేతాటికింద కట్టేసి అడ్డదిడ్డంగా వాదించేసి కన్ఫ్యూజ్ చేసేద్దామా ?

నిజం అంతలా కళ్ళముందు స్పెషల్ డాన్స్ చేస్తుంటే ఎట్లా ఇన్ని అభాండాలు వేసేది? అబ్బాయిలు మారిపోయారు చాలా. ఇద్దరూ పని చేసేవారు అయితే ఎంత చక్కగా పనులు పంచుకుంటున్నారు. 'ఒకసారి నువ్వైతే ఒకసారి నేను' అని అన్నీ చెరి సమానం పనులు. ఇంకా అబ్బాయిలకు కాస్త ఎక్కువ సమానత్వమే పనులలో. మొన్న గెట్ టుగెథెర్ లో నిషా వాళ్ళాయన , చక్కగా నాకు లాగానే ఇండియాలో ఉద్యోగం వదిలి నిషా వీసాపైన ఇక్కడికి వచ్చెయ్యలేదూ. మిష్టర్ పెళ్ళాం అవ్వాల్సివచ్చినా నిమిషం ఆలోచించడం లేదు. డెలివరీల తర్వాత పిల్లల విషయంలో కూడా అన్నీ తెలుసుకుంటున్నారు, అన్నిట్లో తాము కూడా ఉండితీరాల్సిందే అంటున్నారు. 202 లో వుండే అనూష తమ్ముడి పెళ్ళికని పిల్లని విడిచి ఇండియా వెళితే పూటకో రకంగా వండి బాక్సులు కట్టి, జడలు వేసి పిల్లని చూసుకుంటున్నాడు కదా వాళ్ళ నాన్న. ఇలాగ ఎటువైపు చూసినా ఆదర్శ పుణ్య పురుషులే కనపడుతున్నారే! ఏమని సాధించాలి వీళ్ళనీ. అయినా అసలు ఎందుకు సాధించాలి?

ఎంతో మంది ఒకప్పటి అమ్మాయిలు, అమ్మలు కలలు కన్న మార్పు కదూ ఇది. సమానంగా కాడెని పంచుకుని చేసే జోడెడ్ల సవారీ. జాం జాం గా లాగించెయ్యాలి. అంతే కానీ "నువ్వా నేనా? అటు పక్క ఎక్కువ బరువా? ఇటు పక్క తక్కువ విసుగా ?" అని లెక్కలు వేసుకుని చేతికి వచ్చిన సమానత్వాన్ని పాడుచేసేస్తున్నామా ? అమ్మ కష్టం చూసి, అమ్మ చెప్పిన విలువలు విని పెరిగిన "బంగారు తండ్రులు". మా ముందు తరం అమ్మలు మాకు ఇచ్చిన వరాలు కదూ వీళ్ళు . మార్పు ఇంటినుండి, అమ్మల నుండి మొదలయ్యి ఇంతింతై వటుడింతై అన్నట్లు వాటి ఫలాలను మా చేతిలో ఉంచింది . జాగ్రత్తగా చూసుకోవాలి. వచ్చినంత సేపు పట్టదు వెనక్కి వెళ్లిపోటానికి. 'ప్రేమ, గౌరవం' తో ఆనకట్ట కట్టెయ్యాలి. ఈ రెండిటి కోసమే కదూ వెనకటి పోరాటాలు అన్నీ. ఇచ్చిపుచ్చుకుంటేనే కదా నిలిచేది? ఒక్కరే అట్టిపెట్టేసుకుని అవతలి వారిని అణచివేస్తే ఎలా? ఒకప్పుడు వాళ్ళు చేసిన తప్పు. ఆ బాధ తెలిసీ మనం మళ్ళీ అదే తప్పు చేయొచ్చా?

తీగ లాగితే డొంకంతా కదిలినట్టుగా ఉంది. దొండకాయలు కోసే లోపు మోక్షం సిద్ధించింది. సూక్ష్మం బోధపడింది. ఎవరి కోసం ఈ మూర్ఖపు పట్టుదలలు. నా అహం కోసం ఈ చిటికెడు జీవితంలో ప్రశాంతతని వదులుకుంటానేంటి! ఆశ దోశ. ఇవన్నీ కాదు. ఉన్నదున్నట్టు చెప్పేద్దాం అంతే. ఆ పైన చూసుకుందాం . అంతదాకా వస్తే దొండకాయ కూర ముందర పెట్టేసి అప్పుడు మొదలుపెడదాం. రెండో ముద్దకే వేరే లోకాలలో నెలవంక సెట్టింగులో ఉయ్యాలలు ఊగుతూ ఉంటాడు కదా! అప్పుడు చెపుదాం మెల్లిగా అని కదిలాను వర్తమానాన్ని ఎదుర్కోడానికి.

*(వచ్చేనెలలో అమెరికా అమ్మాయి ఏం చెబుతుందో.. ఎదురుచూద్దాం..!!)*

Post your comments